# వేలం

**– ఇమంది రామారావు**

''వంద''

రెండొందలు..

మూడొందలు..నాలుగు..అయిదు..ఆరు..ఏడు..ఎనిమిది...తొమ్మిది..వెయ్యి..

''వెయ్యి!'' అంతే!

ఆమె పేరు పంకజం. చదువుకున్న 'కళ' ముఖంలో చెప్పకనే చెబుతోంది. గాజుకళ్ళతో శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది. ఆమెకు ఖరీదుకట్టే షరాబు మాత్రం చుట్టూతా చిరుతపులిలా చూస్తూ మీసం మెలివేస్తూ విషపు నవ్వు నవ్వాడు.

''అయ్యా...అయ్యా..మరీ వెయ్యి రూపాయలకి ఒకటో సారి అనేయడం ఏం బాగోలేదయ్యా..'' ధన్రాజు మొత్తుకున్నాడు. పేరుకి ధన్రాజే అయినా పుట్టు దరిద్రుడు. ప్రపంచంలోవున్న దరిద్రపు అలవాట్లటికీ అతగాడు సజీవరూపం. పంకజంతోబాటు మరో ఇద్దరు మగపిల్లలు అతగాడి బాధ్యతా రహితమైన కామానికి మిగిలిన ప్రతిరూపాలు.

ఆ పోతరాజుకి బలెయ్యడానికి బలిపశువుగా పంకజాన్ని తీసుకొచ్చాడు ధన్రాజు. తెగ బాధపడిపోతున్నాడు. వెయ్యి పోతరాజు అప్పు తీర్చడానికే సరిపోతుంది. తాగడానికి ఒక నెల్రోజులికైనా డబ్బుల్లేకపోతే ఎలాగా? అదీ అతగాడి దుఃఖం.

''బాధపడకు ధన్రాజూ...నువ్వలా కళ్ళు మూసుకుంటే ఒక సంవత్సరం గడిచిపోతుంది. నీకూతుర్ని పువ్వుల్లో పెట్టి అప్పచెప్పే పూచీ నాది. ఇకపోతే నీకు తాగడానికంటావా...పదో పరకో నువ్వెపుడడిగితే కాదన్నానని ధైర్యం చెప్పేడు పోతరాజు.

''పదో పరకో సరేనండీ. మరీ సేతిలో సిల్లర లేకండా..'' గొణిగాడు ధన్రాజు.

పోనీ వందేసుకోరా..మరి మాట్లాడకు. ఇదిగో 'వెయ్యినొక్కంద!' అన్నాడు పోతరాజు రేటు ఎనౌన్స్ చేస్తూ.

''వెయ్యినొక్కంద! రెండోసారి'' సెకండ్ వార్నింగ్ ఇచ్చాడు. ధన్రాజు ఏదో చెప్పబోయాడు. పోతరాజు అతగాడి నోరు నొక్కేశాడు.

పంకజం ముద్దాయిలా తలదించుకుంది.

పోతరాజు గర్వంగా జేబులోంచి వంద రూపాయల నోటు తీసి విసనకర్రతో విసరుకుంటున్నట్లు షోగ్గా అటూ ఇటూ ఆడించాడు.

'ఇంకో వందైనా వస్తే బాగున్నేమో' ధన్రాజు ఆశ.

అందరూ అమ్మవారికి బలి వేసేందుకు తీసుకెళ్ళే మేకపోతుని చూసినట్లు పంకజాన్ని చూడసాగారు.

పంకజం ఒక్కసారి ధన్రాజు కళ్ళలోకి చూసింది.

ఆ చూపులో..వెయ్యి శతఘ్నులు పేలాయి.

కాండ్రించి మొహాన ఉమ్మేయాలనుకుంది. తడారిపోయిన గొంతు అందుకు అవకాశం ఇవ్వలేదు. అసహ్యించుకుంది.

''మూడువేలు!'' అని వినిపించిందో గొంతు.

పోతరాజు నెత్తిమీద పిడుగు పడ్డట్టు ఫీలయ్యాడు.

ధన్రాజు ముఖంలో వెయ్యి మెర్క్యూరీ లైట్లు వెలిగినంత సందడి.

పంకజం తల పైకెత్తి చూసింది.

''మూడువేలు!'' ఆవేశంగా అరిచాడు.

''డబ్బులుండే వేలం పాడుతున్నారా?'' అడిగాడు వేలం పాటగాడు.

''అసలెవడివయ్యా నువ్వు?'' నిలదీశాడు పోతరాజు.

''మూడువేలు..'' మూడోసారి అన్నాడా యువకుడు.

''మూడోసారి అనడానికి నువ్వెవడివోయ్. మూడువేల ఒక్కంద'' అన్నాడు పోతరాజు. తన మాటకెదురు చెప్పే వాళ్ళు-దారిదాపుల్లో ఎవరూ లేరు.

''నాలుగువేలు!'' మరింత ఆవేశంగా అరిచాడు.

''నాలుగువేలొక్కంద!'' పోతరాజు కంట్రోల్ తప్పుతున్నాడని గ్రహించి అతగాడి అసిస్టెంట్ మరిక ముందుకెళ్ళొద్దన్నట్టుగా సైగ చేశాడు.

''పరువు పోతోంది కదరా'' అసిస్టెంట్ చెవిలో గొణిగాడు.

''పోతే పోయిందండీ. మూడువేలకి దీని తలదన్నే బొమ్మ అంగట్లో దొరుకుతుందండీ. తర్వాత నా తోలు వొలిచేస్తారు'' ముందు జరగబోయేది ఊహించి చెప్పేడు అసిస్టెంట్.

''అయిదువేలు!'' యాభయ్ నోట్లకట్ట బయటికి తీశాడా యువకుడు. పోతరాజుకి నమిలి మింగెయ్యాలన్నంత కసిగా వుంది అతడ్ని.

ధన్రాజుకిది కలా! నిజమా! తెలీని స్థితి.

''మూడోసారి అయిదువేలు..'' అంటూ పాట పాడే పెద్దమనిషి అయిదువేలు అందుకొని పంకజాన్ని అతగాడి చేతిలో పెట్టాడు. డబ్బు ధన్రాజు చేతిలో పెట్టాడు. ధన్రాజు చేతిలోంచి పోతరాజు గద్దలా తన్నుకుపోయాడు. పంకజం ఆ యువకుడ్ని అనుసరించింది.

★★★

అర్ధరాత్రయింది.

ఎవరికీ నిద్ర పట్టలేదు. పంకజం తనను అయిదువేల రూపాయలకు కొనుక్కొచ్చిన అతగాడిపేరు కిరణ్ అనీ, ఫ్రీలాన్స్ జర్నలిస్టనీ, మంచి పెయింటరనీ, బావుకుడని అర్థమైంది. ట్యూబులైటు వెలుగుతూనే వుంది. కిరణ్ చంటిపాపలా నిద్రపోతున్నాడు. ఒంటరిగా ఒక ఆడమనిషితో కలిసి వుంటున్నానన్న భావన ఏ కోశానా లేదు.

''ఏవిటాలోచిస్తున్నారు. నాగురించేనా..నిన్నేం చేస్తానని?'' ప్రశ్నల వర్షం కురిపించాడు..

''ఎవరేం చేసినా భయపడను'' అంది తెగింపుగా.

''ఎందుకని?''

''చావుకు సిద్ధపడిందాన్ని. చచ్చి బతుకుతున్నదాన్ని!''

''మీకూ మంచిరోజులు రావచ్చుగా''

'' వస్తే..గిస్తే అవి ఎండమావులే'' అంది జీవంలేని నవ్వు నవ్వి.

కాస్సేపు మౌనంగా వుండిపోయారిద్దరూ.

''మీరు నన్నేం చేయదలుచుకున్నారో చెప్పండి. సంతోషిస్తాను. పెళ్ళి చేసుకుంటాను. నిన్ను పవిత్రంగా చూసుకుంటాను అని మాత్రం చెప్పకండి''

'' ఆ మాటల మీద నమ్మకం లేదా?''

''ఆ మాటల కర్థంలేదు.''

''మీరు బాగా చదువుకున్నారా?''

''ప్రపంచాన్ని...ముఖ్యంగా మగవారి మనస్తత్వాన్ని''

''అన్నీ ఒకేలా వుండవు''

''అలాగని నేను చెప్పలేదే!''

''యు..ఆర్..సో..స్వీట్'' దగ్గరకొచ్చి వొంగి నుదురు మీద ముద్దుపెట్టుకున్నాడు.

పెదవులందుకుంటాడన్న వ్యక్తి నుదురుమీద ముద్దు పెట్టుకొనేసరికి ఖంగుతింది. అర్ధరాత్రి ఆడపిల్ల-అందులోనూ నాలాంటి అందమైన ఆరితేరిన పిల్ల దొరికితే ఇలా తటపటాయిస్తూన్నాడంటే..ఇతగాడేమైనా..అనుమానం మళ్ళింది. కావాలనే గట్టిగా కౌగలించుకుంది.

షాక్ తింది.

పరిపూర్ణమైన మగాడు. అలాగే గట్టిగా హత్తుకుంటూ పడుకుంది.

★★★

ఉదయం పేపర్లో హెడ్లైన్స్‌లో వార్త వచ్చింది. 'వేశ్యలకు పునరావాసం కల్పించాం. అది ప్రభుత్వం బాధ్యత!', 'అమ్ముడుపోతున్న ఆంధ్రుల ఆడపడుచు' పతాక శీర్షికల్లో కిరణ్ రాసిన వార్త సంచలనం సృష్టించుకుంది. ఆ వార్తల ఆధారంగా ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోసాయి. పాలకవర్గం తలెత్తుకోలేని స్థితి. కిరణ్‌ని పత్రికా యాజమాన్యం, ఎడిటోరియల్ స్టాఫ్ మాత్రమే కాకుండా సమకాలీన పాత్రికేయులందరూ ఆకాశానికెత్తేశారు..చెప్పద్దూ..కిరణ్‌కిది అనూహ్యమైన థ్రిల్‌గా అనిపించింది. ప్రొప్రైటరు రివార్డు కూడా ఇచ్చాడు. ఆనందంతో తబ్బిబ్బయిపోతూ ఇంటికొచ్చాడు. గదంతా మాడరేట్‌గా అలంకరించబడి వుంది. వివిధ మేగజైన్స్‌లో వచ్చిన కలర్ ఫోటోల్ని గోడకి సెల్లోటేప్‌తో అంటించింది. ముఖ్యంగా తను ఎగ్జైట్ అయింది. వీరేశలింగం...మదర్ థెరిస్సా...వివేకానంద ఛాయాచిత్రాల్ని లామినేట్ చేసి టేబుల్ మీదుంచింది. అది చూసి-

''బ్యూటీఫుల్..ఎక్సలెంట్..పంకజం నిన్ను ఇలా చూస్తుంటే ఏమనిపిస్తోందో తెలుసా?''

"అమాంతంగా ఎత్తుకొని గిరగిరా తిప్పి ముద్దుపెట్టుకోవాలని మాత్రం అనిపించడం లేదు!"

"అరె. నీకు జోస్యం చెప్పడం కూడా తెలుసా?"

"జాతకాలు చెప్పడం తెలుసు!" అంది నవ్వాపుకొంటూ.

"బయటకెళ్లి భోంచేద్దాం..రా!" అన్నాడు ముఖం అద్దంలో చూసుకొని తల దువ్వుకుంటూ.

"వంట రెడీ సార్..మీరు కూర్చుంటే వడ్డించేస్తా!"

"అరె నీకెందుకు వంటా పెంటా ఇదంతా.."

"అయిదువేలిచ్చి కొనుక్కున్నందుకు అమాత్రమైనా ఉపయోగపడాలి కదా"

ఆ మాట విన్న కిరణ్ షాక్ తిన్నాడు. తనక్కావలసింది అదే. అలా సూటిగా గుండె గొంతుతో మాట్లాడాలి. దాన్ని ఆత్మీయతగా నమ్ముతాడు.

భోజనం వడ్డించింది. అన్నీ తనకిష్టమైన వంటకాలే. తృప్తిగా తిన్నారు.

"ఏంటయ్యా కిరణూ..నువ్వేదో పెద్ద సంఘ సంస్కర్తలాగా ఎవరో చెడిపోయిన పిల్లని తీసుకొచ్చావుట. ఇది సంసారులుండే కొంప. వెంటనే ఆ అమ్మాయిని పంపించెయ్!"

"పంపించకపోతే?" చిరాగ్గా అడిగాడు.

"నిన్నూ పంపించాల్సి వుంటుంది!"

"సరే. నెలాఖరుకి ఖాళీ చేస్తాలెండి. మీరెళ్ళండి!"

"ఇది నా ఇల్లు. నన్ను వెళ్ళమని చెప్పడానికి నువ్వెవరివయ్యా?" దబాయించాడు.

"అయితే ఏం చేయమంటారు?"

"నువ్వేం చేస్తావో నాకు తెలీదు. ఇదిగో నువ్విచ్చిన రెండువేల రూపాయల అడ్వాన్సు! ఇవ్వాళ పదో తారీఖు. ఈ పదిరోజులకి అద్దె కట్టనవసరం లేదు. నువ్వు తక్షణం వెళ్ళిపోతే అదే పదివేలు!" రెండు చేతులు జోడించి దండం పెట్టాడు ఇంటి ఓనరు.

"అసలేం జరిగిందండీ...ఎందుకిలా అయిపోతున్నారు?"

"అయ్యా మహానుభావా! నువ్వు ఉదయం డ్యూటీకి వెళ్ళగానే పోలీసు లొచ్చారు. సివియర్‌గా వార్నింగ్ ఇచ్చి మరీ వెళ్ళారు. తరువాత పేర్లెందుకుగాని పాలకవర్గంలో అతి ప్రధానమైన రాజకీయ నాయకుల పియ్యేలు వొచ్చారు. నీ గురించి ఇరుగు పొరుగు వారందర్నీ కిందామీదా పెట్టి కావలసిన సమాచారం రాబట్టారు. ఆఖరుకి నువ్వు ప్రేమించిన అమ్మాయి ఆత్మహత్యతో సైతం"

కరెంట్‌షాక్ తగిలినట్లు ఫీలయ్యాడు కిరణ్.

"పద్మ చావుకీ నాకూ సంబంధం ఏవిటి?" అప్రయత్నంగా అడిగాడు.

"నిన్ను ప్రేమించింది కదా..ఉరి పోసుకుంది కదా!"

వాళ్ళ నాన్నగారొప్పుకుంటే మా పెళ్ళి జరిగుండేది కదా!"

"ఏమో అది ఆత్మహత్యో హత్యో అన్న అనుమానం పద్మ నాన్నగారు స్పష్టం చేశారు. నీమీదకి చాలా కేసులు రానున్నాయి.



అయినా లోకంలో అవినీతి అధర్మం అన్యాయాలు గాలిలో కలిసిపోయి సంచరిస్తున్నాయి. వాటిని ఆపడానికి నువ్వెవడివేయ్...నీ పని నువ్వు చూసుకోక. పేపరుందని కలంతో నీ బలం చూపిస్తే...అవతలవాళ్ళు నీకులం...కాదు శాల్తీనీ గల్లంతు చేస్తారు. అయినా ఇవ్వన్నీ పెద్దవాడిగా చెప్తున్నాను. అయినా ఈ విషయాలన్నీ నా కనవసరం. నువ్వు తక్షణం ఖాళీ చెయ్యడమే నాకు కావలసింది" అన్నాడు ఇంటి ఓనరు.

పంకజం ముఖంలో కత్తిగాటుకు నెత్తురుచుక్క లేదు. అలా పాలిపోయింది. తనమూలంగా ఎన్ని కష్టాల్ని కొని తెచ్చుకున్నాడు. సహృదయానికీ సౌశీల్యానికి సమాజం అందించే కితాబు ఇదేనా? అయినా వాళ్ళు అభ్యుదయం గురించి, చైతన్యం గురించి ఉపన్యాసాలు దంచుతుంటారు. పేపర్లలో ప్రకటనలు ఇస్తుంటారు. పంకజం మెదడుని తొలిచేస్తున్నాయి ఆలోచనలు.

"సామాన్లు తర్వాత తీసుకెళ్తాను. తాళం తీసికెళ్తాను. ఒకరి దయాధర్మాలమీద ఆధారపడి బ్రతకడం నా ప్రాణముండగా జరగని పని. ఇదిగో వెయ్యి, నెలరోజులకు సరిపడా డబ్బు నాదే మీదగ్గరుంచుకోండి" అంటూ వెయ్యి రూపాయలు ఇంటి ఓనరు చేతిలో పెట్టాడు. పంకజంతో కలిసి బయలుదేరాడు. కావలిసిన బట్టలు మాత్రం పట్టుకున్నారు. తనకు తెలిసిన హోటల్లో రూము తీసుకున్నాడు.

బెడ్‌మీద సాగిలబడుతూ "పంకజం ఏవైనా మంచి కబుర్లు చెప్పు!" అన్నాడు చనువుగా.

"నావల్లనేగా ఇన్ని కష్టాలు పడుతుంది అని మాత్రం అడక్కు" అన్నాడు తనే కల్పించుకుంటూ. పంకజం సన్నగా నవ్వేసింది.

"అలా కూర్చో..నిన్నే కొరుక్కు తినేయనులే!" అన్నాడు.

బెడ్‌మీద పక్కనే కూర్చుంది పంకజం.

రెప్పార్పకుండా పంకజం కళ్ళల్లోకి చూస్తూ "ముఖం అలా సీరియస్‌గా పెట్టకు. నువ్వు నవ్వితే వెన్నెల్లా వుంటుంది. నీ మాటల్లో భావుకత్వం పుట్టిపడుతోంది. అలా మాట్లాడేవాళ్ళంటే నాకు చాలా ఇష్టం!" అన్నాడు.

"ఇలా మాట్లాడేవారు మీకెంతమంది తెలుసు?" ఠక్కున అడిగింది.

"అదిగో..అదే..అదే. .స్పాంటేనియస్‌గా పంచ్ పేలుస్తావు. సమయస్ఫూర్తి అంటే అదే!" మెప్పుకోలుగా షేక్‌హేండిచ్చాడు.

తీయని స్పర్శ. తెలియని తమకం. అవ్యాక్రమయిన మధురానుభూతి. ఆ చెయ్యి అలాగే వుండిపోతే? చాలా స్వార్థపరమయిన కోరిక కదూ! తనకు తానే సమాధానం చెప్పుకుంది.

ఫోను మోగింది.

"హల్లో కిరణ్ హియర్!" ఫోనెత్తుకున్నాడు.

"మిస్టర్ కిరణ్. నిన్నో పదినిముషాల్లో రైడ్ చేసి పట్టుకుంటాం. చేతనైతే తప్పించుకో!"

"ఎవరు మీరు?" కంగారు పడకుండా అడిగాడు కిరణ్.

"రైడింగ్ ఎవరు చేస్తారు..పోలీసులు"

"అదే ఎవరి మనుషులు మీరు?"

"షటప్..అతి వాగుడు కట్టిపెట్టు. ఒక ప్రభుత్వం, పాలకవర్గం, పెద్దా చిన్నా ఎవరేవిటో తెలుసుకొని ప్రవర్తించు! కాగితం కలం వుందికదాని చిందులేయకు!" ఫోను పెట్టేశాడు అవతలి వ్యక్తి.

"ఇప్పుడెలా?" భయపడుతూ అడిగింది పంకజం.

"డోంట్ వర్రీ. అంతా మన మంచికే!"

"అది పాత కథ. పోలీసులు రైడ్ చేస్తే మనకి మంచేలా జరుగుతుంది? దీనివెనుక చాలామంది పెద్దమనుషుల

హస్తం వుంది. కిరణ్..ముందు వారి బారినుండి బయటపడే మార్గం ఆలోచించు'' అంది.

కిరణ్ ఏదో ఫ్లాష్ మెరిసినట్లు ఫీలయ్యి కిందకి వెళ్ళి వచ్చాడు.

''ఆలోచించాను పంకజం. ఇదిగో తాళి. నీ మెళ్ళో కడుతున్నాను. మన పెళ్ళికి మమతానురాగాలే మంగళవాద్యాలు...మనస్సాక్షులే సాక్షులు. నిన్ను నేను మనస్సాక్షిగా నా భార్యగా స్వీకరిస్తున్నాను'' అంటూ తాళి కట్టేసాడు.

పంకజం ఆపాదమస్తకం పులకించిపోయింది. కళ్ళు చెమర్చాయి. ఒక్కసారి భోరుమని ఏడ్చి..కిరణ్‌కి హత్తుకుపోయింది.

తలుపులు శబ్దం చేశారు. కాలింగ్‌బెల్ మ్రోగింది. కిరణ్ తలుపులు తీశాడు.

''వీరిద్దర్నీ అరెస్ట్ చేయండి!''

''ఎందుకూ''

''హోటల్ రూమ్‌లో వ్యభిచరిస్తున్నందుకు!''

''ఆమె నా భార్య''

''ఎప్పుడయ్యింది?''

''ఆమె పుట్టకముందే అయ్యింది. మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అని మీకు తెలీదా!''

''కుళ్ళు జోకులెయ్యకు! మీకు పెళ్ళయింది అని చెప్పడానికి ఆధారం ఏంటి?''

''లేవు..సారీ..ఈరోజే ఈవినింగ్ డైలీలో ఈ వార్త వస్తుంది చూడండి''

''ఇది పబ్లిసిటీ స్టంటేమో''

''ఆ ఖర్మ నాకు పట్టలేదు. ఇక మీరెళ్ళొచ్చు. అతిగా ప్రవర్తిస్తే రేపుదయం పేపర్నిండా మీ వార్తలే వుంటాయి. సంసారపక్షంగా హనీమూన్ కొచ్చిన మమ్మల్ని డిస్టర్బ్ చేసి రభస చేశారని మీమీద కేసు పెట్టాల్సివొస్తుంది'' కిరణ్ సీరియస్‌గా హెచ్చరించాడు పోలీసులకు. చుక్కెదురయి వచ్చిన దారిన వెళ్ళిపోయారు. కిరణ్ సాహసాన్ని అభినందించకుండా వుండలేని పంకజం లతలా వాటేసుకొని అతని పెదవులందుకుంది.

★★★

కిరణ్, పంకజం కళ్ళు తెరిచి చూసేసరికి...ఎక్కడో..అపరిచితమైనచోట వున్నారు. ఎదురుగా పోతరాజు. పోతరాజుని చూడగానే స్థాణువులా అయిపోయింది పంకజం.

''అలాగ షాకయిపోకు! ఏమిటిదంతా. ఇక్కడికి మీరెలా గొచ్చారు. నెనెలా గొచ్చానూ అనుకుంటున్నారా...మరదే డబ్బు పలుకుబడి పవరంటే. నువ్వొక పతివ్రతా శిరోమణివి. ఇతగాడు నిన్నుద్ధరించడానికొచ్చిన మహానుభావుడు. శభాష్ బాగుంది. కథ మంచి పాకాన పడింది'' ఉక్రోషంగా అన్నాడు.

కిరణ్‌లో విచిత్రమైన మార్పు కనిపిస్తోంది. నిస్సహాయంగా అచేతనంగా వుండిపోయాడు. తన ఎదురుగా వున్నది తను తాళి కట్టిన పంకజమా? పద్మావతా? గుర్తుపట్టలేని స్థితిలో వున్నాడు.

కిరణ్..కిరణ్..ఏమయ్యింది నీకు..ఎందుకలా అయిపోతున్నావ్? బాధగా కంగారుగా అడిగింది...కిరణ్ సమాధానం చెప్పలేదు...పోతరాజు మాత్రం ఆగకుండా నవ్వుతూనే వున్నాడు.

''ఎందుకూ పిచ్చెక్కినట్టు నవ్వుతున్నావ్?''

''అసలు విషయం తెలిస్తే నీకు పిచ్చెక్కుతుంది!''

''ఏమిటా అసలు విషయం!''

''కిరణ్‌కి స్పృహ రాదు. ప్రస్తుతం కోమా స్టేజీలో వున్నాడు. నీ కళ్ళ ముందరే చిత్రహింస చేయడం..అది నువ్వు చూసి తల బాదుకోవడం చాలా బాగుంటుంది కదూ?'' కత్తితో చేతిమీద గాటు పెట్టాడు. ఫస్ మంటూ రక్తం చిమ్మింది.

''ఈ చేత్తోనే వార్తలు రాసిన పెద్దమనిషి ఎలా అయిపోయాడో చూడు. గాయపరిచినా ప్రతిఘటించలేని స్థితిలో వున్నాడు నీ ప్రియుడు. సారీ నీ మొగుడు!'' అన్నాడు.

పంకజానికి బుర్ర పనిచేయడం ఆగిపోయింది. కిరణ్‌ని గాయపరుస్తున్నారు. కాస్సేపట్లో ప్రాణాలు తీస్తారేమో. నే..నే..అలా జరక్కూడదు.

''పోతరాజుగారూ! మీకు దండం పెడతాను. కిరణ్‌ని విడిచిపెట్టండి. కిరణ్ దేవుడు!'' అంది భోరుమని.

''దేవుడు కాబట్టే..ఈ దేవుడ్ని ఎంత గాయపరిచినా మరో దేవుడు రాడు'' ముఖం మీద కత్తితో గాటు పెట్టాడు. అందమైన ముఖం మీద కత్తిగాటు పొంగి ప్రవహిస్తున్న రక్తం చూడలేకపోయింది. కిరణ్‌మీద పడిపోయింది.

''ఒద్దు. ఇక కిరణ్‌ని గాయపరచొద్దు. మీకేం కావాలో చెప్పండి. కిరణ్‌ని విడిచిపెట్టండి'' పోతరాజు కాళ్ళమీద బ్రతిమాలింది.

''ఈ బుద్ధి ముందే వుంటే ఇంతదూరం వచ్చేది కాదుగా'' బుగ్గను దూదితో అద్ది..కాస్త కారం అంటించాడు పోతరాజు. కిరణ్‌లో చలనం లేదు. పంకజం విలవిల్లాడిపోయింది.

''ఒద్దు..వొద్దు కిరణ్‌నింకేం చేయద్దు. కావలిస్తే నన్ను గాయపరచండి. మీ కసి తీర్చుకోండి'' అంది తను సిద్ధపడుతూ.

''సరే..నేను చెప్పినట్లు నువ్వు వింటే, నీ మాట మేము వింటాము'' అన్నాడు. అంతలోనే బిలబిలమంటూ సూట్‌వాలాలు వచ్చారు. పంకజాన్ని ఆకలిగొన్న పులుల్లా చూస్తున్నారు.

''చెప్పండి మీకేం కావాలో'' అంది.

''నువ్వు!''

''అయితే. కిరణ్‌ని ప్రెస్ యాజమాన్యంకి అప్పగించండి. కిరణ్ సురక్షితంగా పత్రిక యాజమాన్యాన్ని చేరగలిగితే ఇక మీ ఇష్టం! ముందు కిరణ్‌ని ఇక్కడ్నించి పంపించండి!'' అంది. పోతరాజు క్షణం ఆలోచనలో పడ్డాడు.

''మనక్కావలసింది పంకజం. గుర్తు తెలియని వ్యక్తి నిచ్చి పంపించు'' అంటూ ఓ పెద్ద మోతుబరి సలహా ఇచ్చాడు.

రేపు పంకజం తిరగబడి సాక్ష్యం చెబితే?

''ఇంకెక్కడి పంకజం. గల్ఫ్ దేశాలకి ఎత్తుకుపోతున్నాంగా'' అన్నాడు మరొకడు ఆశగా.

పంకజం ''ముందు కిరణ్‌ని పంపించండి'' అంది.

''ఓ.కె ఓ.కె! అలాగే పంపిస్తున్నాం'' అన్నాడు పోతరాజు.

''ఇంత సమర్థుడివి. మధ్యలో నీ మనసు మారదని నమ్మకం ఏమిటి! నేనూ కార్లో వుంటాను. చేరవలసిన చోటుకి చేర్చుతాను. తర్వాత మీ ఇష్టం!'' అంది. పోతరాజు తటపటాయిస్తున్నా మిగతావాళ్ళు ఫోర్సు చేశారు. పంకజం కిరణ్‌ని తను పనిచేస్తున్న పత్రికా ఆఫీసుకి చేర్చింది. ఓ ఉత్తరం కిరణ్ జేబులో పెట్టింది.

పంకజం తిరిగి రాగానే అందరూ మూకుమ్మడిగా మీద పడబోయారు.

''ఆగండాగండి! ఇప్పుడు పంకజం సామాన్యురాలు కాదు. అడ్రసు లేని రోజుల్లోనే ఆమె రేటు అయిదువేలు. ఇప్పుడు వార్తల్లోకెక్కిన వ్యక్తి. డిమాండ్ చాలా వుంది. మీరు కాకపోతే మరొకరు. వేలం వేస్తాను. పాడుకోండి..''

ముందుగా న్యాయబద్ధమైన పాట ''యాభయ్‌వేలు'' అన్నాడు.

''అర్వై''

''డెబ్బై''

''లక్షా!''

అన్నాడో ఆసామి. పోతరాజు 'లక్ష ఒకటోసారి' అన్నాడు. మరొకడు రెండు లక్షలన్నాడు. రెండు లక్షలు రెండోసారి అన్నాడు. పెద్ద షేక్ మూడులక్షలు ఆఫర్ చేశాడు. ఆ పెద్ద షేక్ మూడు లక్షలు ఆఫర్ చేశాడు. ఆ పెద్ద షేక్‌కే కన్‌ఫర్మ్ చేశాడు పోతరాజు. మూడు లక్షలు కేష్ తీసుకొని పంకజాన్ని అప్పగించాడు.

చీఫ్ మినిష్టర్ ప్రోగ్రామ్‌కి ఎటెండవ్వడానికి వెళ్ళిపోయాడు పోతరాజు.

పంకజం ఫ్లైట్‌లో గల్ఫ్ దేశాలకు ఎగిరిపోయింది. కిరణ్ కళ్ళు తెరిచి చూసేసరికి గాయపడిన తను. తన పాకెట్‌లో లెటరు వుంది.

''జన్మజన్మలకు నీదాన్ని కావాలన్న ఆశతో..శ్వాసతో..నీ పంకజం'' అని వుంది...గల్ఫ్ దేశంలో పంకజం అడుగుపెట్టింది. పెద్ద షేక్ తన గెస్ట్‌హౌస్‌లో ఫ్రెండ్స్‌ని పార్టీకి పిలిచాడు. ''దీసీజ్ మిస్ పంకజం. వెరీ పాపులర్ ఫిగర్. టేక్ హెర్ ఫర్ ఒన్ ఇయర్. వేలం పాట అయిదు లక్షలు..'' అన్నాడు హుందాగా.

వేలం పాట సాగుతోంది..అలా..అలా..అలాగే...

